క్లుప్తంగా

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం బంతే బుద్ధ ఘోష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అతిథులను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

బోథ్: విద్యార్థులు ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో చేరాలని బోథ్ తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమేష్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో చేరే విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ బోధనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈనెల 25 వరకు దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 96665 25131 సంప్రదించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


హోమంలో పాల్గొన్న భక్తులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో వీరబ్రహేంద్ర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. హోమం నిర్వహించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి


హెరేకుమ్ర వంశీయులతో ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని కేస్లాగూడ గ్రామంలో వైశాక మాసంను పురస్కరించుకొని హెరేకుమ్ర వంశీయులు నిర్వహించి పెర్సపేన్ పూజలకు హాజరయ్యారు. పెర్సపేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీలు ప్రకృతిని దైవంగా భావించి ఎంతో నియమ నిష్టాలతో పూజలు చేసి తమ సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెరేకుమ్ర వంశీయులు రామరావ్, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిరుద్యోగులు, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యపూరిత వైఖరితో వ్యవహరించాయని ఆరోపించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ప్రసాద్ పాల్గొన్నారు.

'రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి'

ఎదులాపురం: వానాకాలం సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో కుమ్రం భీమ్ భవనంలో మాట్లాడారు. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాలు, ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీ వ్యవసాయ పరికరాలు సకాలంలో అందించాలన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

- రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించిన అధికారులు


ఆదిలాబాద్‌టౌన్: తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గోదాములో నిల్వ ఉన్న విత్తనాలు, రికార్డులో ఉన్నవాటిపై ఆరా తీశారు. జిల్లా రైతులకు తప్పా ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాల రైతులకు విక్రయించవద్దని సూచించారు. వ్యవసాయ అధికారి రమేశ్, వన్‌టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి, తహసీల్దార్ సంతోష్ రెడ్డిలు మాట్లాడుతూ.. దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. విత్తనాల ధరల బోర్డును షాప్‌లో విధిగా ఉంచాలని సూచించారు. తనిఖీల అనంతరం విత్తన విక్రయదారులతో, వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో నేరడిగొండ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ గ్రామాల డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఎరువులు, విత్తన డీలర్లు రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై దుబ్బాక సునీల్, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్‌లు అన్నారు. గురువారం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కలిసి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. రైతులను మోసం చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేసి, దుకాణాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎదులాపురం: ఆదివాసీలకు నకిలీ విత్తనాలు అంటగడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొంత మంది వ్యాపారులు మార్కెట్‌లో విత్తనాల కొరత సృష్టిస్తూ బ్లాక్‌లో మహారాష్ట్రలో అమ్ముకుంటున్నారని, రశీదు ఇవ్వకుండా విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జైనథ్: నకిలీ విత్తనాలు అరికట్టడంలో అధికారులు, విత్తనాలు, ఎరువుల డీలర్లు బాధ్యతయుతంగా పనిచేయాలని మండల వ్యవసాయాధికారి వివేక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్యాంసుందర్, ఎస్సై పురుషోత్తం, ఏవో వివేక్‌లతో టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో వివేక్ మాట్లాడుతూ.. ఏఈవో వారికి కేటాయించిన గ్రామాల్లో తరుచుగా పర్యటిస్తూ.. రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విక్రయిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలని కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్రరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్పందించి నకిలీ విత్తనాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కొలాం హక్కుల పోరాట సమితి డివిజన్ అధ్యక్షుడు టేకం గణేష్, టేకం భీము, వినయ్, కొడప విజయ్, దిలీప్ పాల్గొన్నారు.


తాంసి: తనిఖీ చేస్తున్న ఏడీఏ రవీందర్

తాంసి: విత్తన దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తాంసి ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు విత్తన దుకాణాలను తహసీల్దార్ లక్ష్మీ, ఎస్సై శివరాంతో కలిసి పరిశీలించారు. విత్తన ప్యాకెట్లు పరిశీలించి, స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేశ్, యోగి రాజ్, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మార్కెట్లో పత్తి విత్తనాల కొరత లేదని ఏవో మహేందర్, తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. స్టాక్ వివరాలను తప్పనిసరిగా రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రమేశ్, కీర్తి పాల్గొన్నారు.

ఇచ్చోడ: రైతులు నకిలీ విత్తనాలను విత్తుకోవద్దని ఏఈవో ఉదయ్‌కిరణ్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గాయిద్‌పల్లిలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలను విక్రయించేందుకు వచ్చిన వారి సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

- నకిలీ విత్తనాలు విక్రయించిన ఫర్టిలైజర్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తుకారాం అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతువేదికలో ఫర్టిలైజర్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. సమావేశంలో సీఐ భీమేష్, ఏవో జాదవ్ కైలాస్, ఎస్సై నరేశ్, ఫర్టిలైజర్ వ్యాపారులు పాల్గొన్నారు.


ఇచ్చోడ: మాట్లాడుతున్న తహసీల్దార్ తుకారాం


బజార్‌హత్నూర్: తనిఖీ చేస్తున్న అధికారులు


ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న ఎస్సై దుబ్బాక సునీల్


తలమడుగు: సుంకిడిలో..

బజార్‌హత్నూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శంకర్ అన్నారు. గురువారం మండలంలో పలు విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏవో ప్రమోద్‌రెడ్డి, ఎస్సై నరేశ్‌తో కలిసి తనిఖీలు చేశారు. విత్తన కొరత, ఎరువుల కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు అమ్మిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంతోష్, సంజీవ్, రాజేశ్వర్, రాము, కృష్ణపాల్, భోజన్న, రమణ, నాగభూషన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్, టీచర్స్‌కాలనీ, కైలాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నదానం

తలమడుగు: మండలం లింగి గ్రామంలోని వృద్ధాశ్రమంలో జైనథ్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బద్రే సుభాష్ బుద్ధ జయంతిని పురష్కరించుకొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెడవ్ అశోక్, విపుల్, అజయ్ కుమార్, మాడవి అశోక్, శేశరావ్, రవి, కళావతి, ఐశ్వర్య పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని సాంగిడికి చెందిన ఎల్మ అమరేందర్ రెడ్డి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాడు. రక్తహీనతతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బేల మండలంలోని సోన్‌కాస్ గ్రామానికి చెందిన సిడం ఈశ్వర్‌కు (బి) పాజిటీవ్ రక్తం అవసరంగా ఉండగా గురువారం స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశాడు.

జొన్న కొనుగోళ్లు పరిశీలన

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి గురువారం పరిశీలించారు. మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచిన జొన్నలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొనుగోలు వివరాలను సీఈవో కేశవ్ ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. వారి వెంట సీఈవోలు రాంరెడ్డి, దత్తు, కార్యదర్శులు సిద్ధు, గణేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పండరీపూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బుద్ధ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద, డైట్ మైదానంలో, కైలాస్‌నగర్‌లోని బుద్ధ విహార్‌లలో బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో పంచశీల జెండా ఆవిష్కరించి, బౌద్ధ వందనం చేశారు. బౌద్ధుని, అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధుడు, అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరు పయనించాలని నాయకులు కోరారు.

తాంసి: బౌద్ధమత స్థాపకుడు గౌతమ బుద్ధుడి జయంతిని మండలంలోని ఇండోసాన్ సాగేంజి జెన్ మాన్స్‌ట్రీ ×మహా ధ్యాన భూమి్ వద్ద ఘనంగా నిర్వహించారు. గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. తెలంగాణ, మహారాష్ట్రల నుంచి పెద్ద ఎత్తున బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు తరలివచ్చి తెల్లని స్వీట్లు, పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో లక్ష్మికాంత్, బాబు సోనులే, ఉత్తమ్ హన్మతే, కీర్తి, కరున్ పాల్గొన్నారు.

తలమడుగు: గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగుల సునీత వెంకట్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో శ్రీ సద్గురు పులాజీ బాబా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గౌతమ బుద్ధుడి జయంతిలో పాల్గొన్నారు. నేటి సమాజంలో శాస్త్ర సాంకేతికంగా ఎంత ఎదిగినా మనిషికి మానసిక ప్రశాంతత లభించడం లేదన్నారు. కాటిపెల్లి సురేశ్‌రెడ్డి, అశోక్, సునీతరెడ్డి, రాధాబాయి ఈశ్వర్ రెడ్డి, రమేశ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఇంద్రమ్మ, అనిత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రస్తుతం ప్రజలు సుఖశాంతులతో జీవించడానికి బుద్ధుడు సూచించిన మార్గమే శరణ్యమని బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ అన్నారు. గురువారం బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని మండల కేంద్రంలోని బుద్ధనగర్‌లో పంచశీల బుద్ధ విహార్, మిలింద్‌నగర్ త్రిరత్న బుద్ధవిహార్, ప్రబుద్ధనగర్‌లోని సామ్రాట్ అశోక బుద్ధ విహార్లో బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధ భగవాన్ ప్రతిమలతో పాటు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. బుద్ధ భక్తులు, దళిత సంఘాల నాయకులు సోమోరే నాగోరావ్, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.


నార్నూర్: వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని అశోక బుద్ధ విహార్‌లోని గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతకాని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడు మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సుభాష్, ఉపాధ్యక్షుడు సునీల్, మహిళా అధ్యక్షుడు కాంతబాయ్, సంఘమిత్ర, నాగారావు, మహేందర్, సంపత్ కుమార్, విద్యాసాగర్, గోరఖ్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలోని దుప్పాపూర్ గ్రామంలోని దమ్మరత్ బుద్ధ విహార్‌తో పాటు మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో గురువారం వైశాఖ బుద్ధ పౌర్ణిమ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, బుద్ధ వందనం తీసుకున్నారు. గౌతమ బుద్ధుడు చూపిన శాంతి మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో దుత్రాజ్, రామ్ కిషన్, అభిమాన్యు, కనక సేవంతాబాయి ప్రభాకర్, విశ్వజిత్, ప్రశాంత్, ధమ్మనంద్, సురేశ్, మధుకర్, జ్ఞానోబా టిబోటి పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌రూరల్: బుద్ధవందనం చేస్తున్న నాయకులు


ఇంద్రవెల్లి: పూజలు చేస్తున్న బుద్ధ భక్తులు


తాంసి: ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ ఉపాసకులు

గ్రామాల్లో జోరుగా బెల్టుషాపులు



నేరడిగొండ: గ్రామాల్లో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎక్సైజ్ అధికారులు ×మామూలు×గా తీసుకోవడం, వీడీసీలు సైతం మద్దతు పలకడంతో బెల్టుషాపుల దందా దర్జాగా నడుస్తోంది. మండల పరిధిలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రతీ గ్రామంలో షాపులను ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారి సమీపంలో రెండు వైన్స్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపులు వెలిశాయి. ఎక్సైజ్ అధికారులను, పోలీసులను మచ్చిక చేసుకుంటూ.. నిర్వాహకులు గ్రామాభివృద్ధి కమిటీల సహకారంతో జోరుగా మద్యం విక్రయిస్తున్నారు. ఇందుకోసం ప్రతీ నెల వీడీసీలకు, అధికారులకు ఎంతోకొంత ముట్టజెబుతున్నారు.

వీడీసీల నిర్లక్ష్యం..

బెల్టు షాపులను నియంత్రించాల్సిన అధికారులతో పాటు వీడీసీలు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది బెల్టుషాపులనే వృత్తిగా మలుచుకున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తూ మందు బాబుల జేబులను గుళ్ల చేస్తున్నారు. బీర్‌కు రూ.10, క్వాటర్‌పై రూ.10 నుంచి రూ.15 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రతి నెల ఆదాయం వస్తుండడంతో వీడీసీలు అక్రమ దందాను చూసీ చూడనట్లు వదిలేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపులను నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని హీరాపూర్ గ్రామంలో రెండు రోజులుగా అంధకారం నెలకొంది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా హీరాపూర్‌లో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. తక్కువ సామర్థ్యం గల టీటీఆర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా హీరాపూర్‌లో విద్యుత్ సమస్య వస్తుందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాంసి: మండలంలోని వడ్డాడి సమీపంలో 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విరిగిపడిన విద్యుత్ స్తంభం పంటచేన్లలో ఉండడంతో మరమ్మతు పనులు ఆలస్యం అవుతోంది. దీంతో తాంసి సబ్‌స్టేషన్ పరిధిలోని తాంసి, కప్పర్ల, జామిడి, పాలోది, గిరిగాం, అంబుగాం, వడ్డాడి గ్రామాలకు విద్యుత్ సరఫరా కావడం లేదు. రాత్రి ఉక్కపోతకు చిన్నారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏఈ మనోజ్ కుమార్ ఎట్టకేలకు మరమ్మతులు పనులు పూర్తి చేయించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

లోకారి(బి)లో వైద్య శిబిరం


వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలో గురువారం ఝరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సంజీవ్ గిరిజనులకు వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడం వలన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సంజీవ్, శ్రీదేవి, కల్పన, ప్రకాష్, వినోద్, మోహన్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో గురువారం రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటికీ తిరుగుతూ.. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఏఎన్ఎంలు సంగీత, సౌందర్య, ఆశ కార్యకర్త, పుష్ప, సుజాత పాల్గొన్నారు.

ఇంట్లో దొంగతనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ముసాహెబ్ ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. అదే కాలనీలో ఓ శుభ కార్యం ఉండడంతో మధ్యాహ్నా ఇంటికి తాళం వేసి వెళ్లారు. గంట తర్వాత తిరిగి వచ్చేసరికి తాళం పగిలి తలుపులు తెరిచి ఉన్నాయి. 5 గ్రాముల బంగారం చోరికి గురైందని బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రాంనగర్‌కు చెందిన రాంటేకి రాజేశ్వర్, ములకల అరుణ్‌లు గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా.. వెంబడించి పట్టుకున్నారు. 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయిని తీసుకొచ్చి ఆదిలాబాద్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పర్సు దొంగిలించిన మహిళ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన సీత అనే మహిళ గురువారం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో పర్సు దొంగతనం చేసింది. సంజయ్‌నగర్‌కు చెందిన ఖాసిమ్ అలీ అనే వ్యక్తి బస్సు ఎక్కుతుండగా.. పర్సు దొంగతనానికి పాల్పడింది. అందులో రూ.1040 ఉన్నాయి. వెంటనే అప్రమత్తమైన ఆయన ఆమెను పట్టుకొని టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

'ప్రశ్నించే గొంతుకకు అవకాశం కల్పించాలి'

నేరడిగొండ: ప్రశ్నించే గొంతుకకు అవకాశం కల్పించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా గురువారం మహబూబాబాద్ జిల్లాలోని మర్రిపాడలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులు మంచి ఆలోచనలు ఉన్న రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.